## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుడివాడ టౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గుడివాడ పట్టణ పరిధిలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ టి.రామకష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

### మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థి ఎంపిక



జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వెన్నా మోహన్‌రామ్‌చరణ్ 2023–24 ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం హనుప్రసాద్ తెలిపారు. మండలంలోని జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదలతో జనరల్ కేటగిరిలో రామ్‌చరణ్ ప్రతిభ కనబర్చి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను, పాఠశాల హెచ్ఎం అభినందించారు.

### దుప్పట్ల పంపిణీ



గుడివాడరూరల్: శ్రీకృష్ణ యాదవసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి, కరుణాపీఠం వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు అన్నదానంతో పాటు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బత్తుల వీర రాఘవమ్మ మూడో వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు వెంకటప్రసాద్, సుధాకర్ సౌజన్యంతో దుప్పట్ల పంపిణీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, నవభారత్ ఖాదీస్టోర్ అధినేత సయ్యద్ గఫార్, కేశంశెట్టి అజయ్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

### మల్లేశ్వరస్వామికి లక్షమల్లెల పూజ



మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కూడా లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. ఆయల పూజారులతోపాటు ధర్మకర్తల మండలి వంశపారంపర్య చైర్మన్ ముత్తేవి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### రామేశ్వరస్వామికి పవళింపు సేవ



టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో బాల పార్వతీ సమేత రామేశ్వర స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామి పవళింపు సేవతో ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొట్నాలు దంచుట, వసంతోత్సవం, అవభృత స్నానోత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పశయ్యాలంకృత పవళింపుసేవ, ధ్వజ అవరోహణం అనంతరం పండిత సత్కారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో వృద్ధుడి అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మిపురంకాలనీ భువనేశ్వరి అపార్టుమెంట్‌కు చెందిన దాసరి బిజిలీకుమారి కుటుంబ సభ్యులతో ఉంటుంది. పమిడిముక్కల మండలం మామిళ్ల పల్లి గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వరరావు (70) గత మూడు నెలలుగా బిజిలీకుమారి ఇంట్లో ఉంటున్నాడు. అతను ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బిలిజీకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తోట్లవల్లూరు బ్రాంచి లైబ్రేరియన్ బాబూరావు పేర్కొన్నారు. స్థానిక బ్రాంచి గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ శిబిరంలో వివిధ అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించినట్లు బాబూరావు తెలిపారు. ప్రతిభ కనబరచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

**ముగిసిన గ్రంథాలయ విజ్ఞాన శిబిరం**

మండవల్లి: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ శిబిరాల ద్వారా విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవడానికి ఎంతో దోహదం చేశాయని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన అన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న పిల్లలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

**కైకలూరులో..**

కైకలూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని అందించారు. ఆయా గ్రంథాలయాల్లో మే 15వ తేదీ నుంచి జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగాయి. విద్యార్థులకు పుస్తక పఠనం, సమీక్షలు, చిత్రలేఖనం, నృత్యం, ఆటపాటలు, యోగా నేర్పించారు. కైకలూరు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజేతలకు చివరి రోజు శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు సీహెచ్.పార్వతీశం, పీవీవీ.భాస్కరరావు బహుమతులను అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

**బాల్యం నుంచే గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలి**

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులు బాల్యం నుంచే గ్రంథాలయానికి వెళ్లడం ఒక అలవాటుగా చేసుకోవాలని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, యోగా గురువు పొట్లూరి ధర్మారావు పేర్కొన్నారు. పామర్రు మండలం జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో పంచతంత్ర కథలు, నీతి కథలు, శతక పద్యాలు,సైన్సు సంగతులు తదితర పుస్తకాలు చదివితే పఠనాశక్తితో పాటు సృజనాత్మకత, జ్ఞాపక శక్తి పెంపొందుతుందన్నారు. పుస్తక పఠనంలో నైతిక, మానవతా విలువలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీవి వంశీ కృష్ణ, విశ్రాంత ఉద్యోగులు సీహెచ్ కృష్ణమోహన్, నాయుడమ్మ, గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

**పామర్రులో..**

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి శుక్రవారం వారకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను అందించామని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు.

**పమిడిముక్కలలో..**



తోట్లవల్లూరులో విజేతలైన చిన్నారులతో గ్రంథాలయాధికారి బాబూరావు

పమిడిముక్కల: గ్రంథాలయాల్లో గత నెల 15 నుంచి కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గురజాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దాత గురజాడ వెంకటరమణ, విశ్రాంత ఉద్యోగి రాజులపాటి వెంకటస్వామి, గ్రంథపాలకుడు సాంబశివరావు పాల్గొన్నారు. అదేవిధంగా కపిలేశ్వరపురం గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు వెనిగళ్ల ప్రతీప్, గ్రామపెద్దలు సుబ్రమణ్యం, సత్యనారాయణ పాల్గొన్నారు.

**గుడివాడలో..**

గుడివాడరూరల్: స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. గత పదిరోజులుగా పలువురు దేశ నాయకులకు సంబంధించి వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన చిన్నారులకు దాతలు సరోజిదేవి, సాహితి స్రవంతి నిర్వాహకుడు లంకా సురేంద్రలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.శాంతి పాల్గొన్నారు.

**మొవ్వలో..**

మొవ్వ: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలని మొవ్వ మండలం విద్యాశాఖాధికారి–2 శ్రీలక్ష్మి సూచించారు. గత నెల 15వ తేదిన ప్రారంభమైన మొవ్వ శాఖా గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే రోజులో కొంత సమయాన్ని గ్రంథాలయాల్లో పుస్తక పఠనానికి కేటాయించి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి టి.కృష్ణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

**కలిదిండిలో..**

కలిదిండి: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు, 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు



అంగలూరులో విజేతలకు ధ్రువపత్రాలను అందిస్తున్న దృశ్యం

**ముదినేపల్లిలో..**

ముదినేపల్లి రూరల్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో 24 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ శిబిరంలో రోజూ విద్యార్థులకు నీతి కథలు, పుస్తక పఠనం, పాటలు, పలు రకాల ఆటలు నిర్వహించి విజ్ఞానాన్ని పెంపొందించారు. ముగింపు రోజైన శుక్రవారం స్థానిక ఉపాధ్యాయులు పాండురంగారావు, మల్లికార్జున రావు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ఆటల పోటీలు నిర్వహించి లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పరసా అంకిత, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరులో..**

గుడ్లవల్లేరు: వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి తరగతుల్లో భాగంగా పుస్తక పఠనంతో పాటు ఆట పాటల సందడి ముగిసింది. శుక్రవారం వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఆ విజేతలకు గుడ్లవల్లేరు, అంగలూరులో గ్రామ కార్యదర్శి నరసింహారావు, బెజవాడ కోటేశ్వరరావు ధ్రువపత్రాలు, బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి మాట్లాడుతూ తమ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో బాల బాలికలు చక్కగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు.



కైకలూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విజేతలకు బహుమతుల ప్రదానం



జమీగొల్వేపల్లిలో విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన అతిథులు



పామర్రులో బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథాలయాధికారి ఝాన్సీ రాణి



గురజాడలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాత గురజాడ వెంకటరమణ



గుడ్లవల్లేరులో విజేతలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న కార్యదర్శి నరసింహారావు



కపిలేశ్వరపురంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రామపెద్ద సత్యనారాయణ



గుడివాడలో అందజేసిన బహుమతులతో కేరింతలు కొడుతున్న చిన్నారులు



మొవ్వ గ్రంథాలయంలో సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులు



కలిదిండి గ్రంథాలయం వద్ద ధ్రువపత్రాలతో విద్యార్థులు

### బ్యాంకు మేనేజర్‌కు సన్మానం



కైకలూరు: ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించి బదిలీపై వెళుతున్న కైకలూరు కెనరా బ్యాంకు మేనేజర్ విశాలక్ష్మిని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున బ్యాంకులో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సంఘ సభ్యులు గుర్రం శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విశాలక్ష్మి అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. అంకితభావంతో పనిచేసే అధికారులు అన్ని చోట్లా గౌరవం పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గాలిబ్‌బాబు, పాండురంగ విఠల్ పాల్గొన్నారు.

### అందరి సహకారం మరువలేనిది

పామర్రు: సార్వత్రిక ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు అందించిన సహకారం మరువ లేనిదని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆమె శుక్రవారం మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు దోహదపడిన అధికారులు, రాజకీయ నాయకులకు తన కృతజ్ఞతలను తెలియజేశారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్న పోలీస్ శాఖ, పాత్రికేయులు అందించిన సేవలను ప్రశంసించారు. స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు ఆమె అభినందనలు తెలిపారు.

### భారీ వర్షం



పామర్రు: పామర్రులో శుక్రవారం భారీవర్షం కురిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయంగామారాయి. స్థానిక నాలుగురోడ్ల కూడలి, బందరు రోడ్డు, గఫార్ సెంటర్, బట్టల కొట్టు బజారు, శివాలయం వీధి, బాపూజీ పేట, అరండల్‌పేట, గాంధీనగరం తదితర ప్రాంతాల్లోని రహదార్లు వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.

# అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

కైకలూరు: 'గెలుపోటములు సహజం, నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. మళ్లీ మొదటి నుంచి ప్రయాణాన్ని మొదలుపెడదాం' అంటూ కైకలూరు వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఏలూరు రోడ్డు పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి వస్తున్న అభిమానులతో వేర్వేరుగా శుక్రవారం మాట్లాడారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఓటమిని ప్రజలు ఇచ్చిన తీర్పుగా అందరూ భావించాలన్నారు. గ్రామాల్లో అధికారపక్ష నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడినా అందరూ సంయమనం పాటించాలన్నారు. నియోజకవర్గంలో రూ.కోట్లలో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నామన్నారు. ప్రజలకు మనపై అపార నమ్మకముందన్నారు. ఫలితాలపై అందరం చర్చించుకుని ప్రజల వద్దకే వెళదామని తెలిపారు.



కైకలూరు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎన్నార్

# అధ్యాపకుల ఇంటింటి ప్రచారం

మోపిదేవి: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలోనూ ఫలితాలు సాధిస్తున్నామని మోపిదేవి జెడ్పీపాఠశాల ప్లస్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పి.జయంతి తెలిపారు. సెలవుల్లోనూ ఇంటింటా క్యాంపెయిన్ నిర్వహిస్తూ కళాశాలలో జరుగుతున్న ఉన్నత విద్యలో మార్పులు, ప్రత్యేకశ్రద్ధను శుక్రవారం తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విదేశీవిద్య, ఉద్యోగ అవకాశాలను వివరించి తమ కళాశాలలో చేర్పించాలని కోరారు. గత ఏడాది తమ కళాశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని కళాశాల అధ్యాపకులు సురేష్, శ్రీనివాస్ వరించారు.



### ఎమ్మెల్యే కుమార్‌రాజాకు అభినందనలు



పామర్రు: పామర్రు టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన వర్ల కుమార్‌రాజాకు పలువురు నాయకులు శుక్రవారం అభినందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాసు ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

### ముమ్మరంగా ఉపాధి పనులు

మండవల్లి: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన 23 గ్రామాల్లో చేపట్టిన 31 పనుల్లో 2,450 మంది కూలీలు పాల్గొన్నట్లు ఎంటీఏ ఎస్ నవీన్ తెలిపారు.తెలిపారు. పంట కాలువలు, పంట బోదెల్లో పూడికతీత పనులు చేపట్టామన్నారు. లింగాలలో రూ. 60 వేల ఉపాధి హామీ నిధులతో 44 మంది పంట బోదె పనులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# వర్షాల్లో ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

- మరిగించిన నీటినే తాగాలి
- సమతుల్య ఆహారం తీసుకోవాలి



డాక్టర్ సుగుణావతి

గుడ్లవల్లేరు: రుతు పవనాలతో ఎండలకు సెలవు వచ్చినట్లే. రాబోతున్న వర్షాల్లో గాలి, తేమ కారణంగా ప్రజలు వ్యాధి కారక ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉంది. తాగునీరు, ఆహారం విషయాల్లో కూడా ఈ సీజన్‌లో కొద్దిపాటి ఆరోగ్య చిట్కాలను పాటిస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు రాబోవని వైద్యులు చెబుతున్నారు. వర్షా కాలంలో కొన్ని ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సీహెచ్.సుగుణావతి తెలిపారు.

**ఈ జాగ్రత్తలు అవసరం..**

కలుషితం కాని తాగునీటినే తాగాలి. మరిగించిన తాగునీటికి కొంత సమయాన్ని కేటాయిస్తే వ్యాధులు వర్షాల్లో దరికి చేరవు. అలాంటి వేడి నీటిని తాగితే రోగ నిరోధక శక్తి పెంపొందించవచ్చు. రోగ నిరోధక శక్తికి కష్టపడి పని చేయటం అవసరం. సరైన పోషకాహార సమతుల్య ఆహారం ద్వారా శరీరానికి పటుత్వం వస్తుంది. స్ట్రీట్ ఫుడ్‌కు స్వస్తి చెప్పాల్సిందే. పరిశుభ్రత లేని ప్రదేశాల్లో తయారు చేసిన ఆహారానికి దూరంగా ఉంటే మంచిది. స్ట్రీట్ ఫుడ్‌కు బదులుగా ఇంట్లో రుచికరమైన హోమ్ ఫుడ్‌నే ఎంజాయ్ చేస్తే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు వ్యాపిస్తాయి. ఆ దోమల దాడి వలన కలిగే వ్యాధులు భయంకరంగా ఉంటాయి. ఇంటి చుట్టుపక్కల ఎక్కడా వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. డ్రెయినేజీ నుంచి పూల కుండీలతో సహా ఎప్పటికపుడు శుభ్రం చేసుకోకపోతే దోమలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. వర్షంలో తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లని పరిస్థితులు ఏర్పడినపుడు తలపై గొడుగు, శరీరానికి జర్కిన్లు, కాళ్లకు షూస్ అవసరం. వర్షంలో తడిస్తే అనారోగ్యం కలిగే అవకాశం ఉంది. ఈ కాలంలో ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోతే అలసిపోతారు. విశ్రాంతి లేక శరీరం బలహీనంగా మారటంతో పాటు రోగ నిరోధక శక్తిపై ప్రభావితం అవుతుంది. అందుకే నిద్రకు కనీసం ఆరు గంటలు కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటారు.



మంచినీటిని మరిగించాలి

# 10న కోదండరామయ్య విగ్రహావిష్కరణ

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో ఈ నెల 10వ తేదీన వేములపల్లి కోదండరామయ్య 110వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని అవిష్కరించనున్నట్లు కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్ మాట్లాడారు. ఈ ప్రాంత విద్యాభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని 1969లో వీకేఆర్ కళాశాలను బుద్ధవరంలో కోదండరామయ్య స్థాపించినట్లు తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న వేలాది మంది దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. విమానాశ్రయ విస్తరణ వల్ల ఉనికిని కోల్పోతున్న కళాశాలను కేసరపల్లిలో ఏర్పాటు చేయడం వల్ల పూర్వ వైభవాన్ని సంతరించుకుందన్నారు. ఈ నేపథ్యంలో విద్య ప్రదాత కోదండరామయ్య విగ్రహాన్ని నూతన క్యాంపస్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### తాడిగడపలో ఆలయ భూముల కౌలు వేలం

పెనమలూరు: తాడిగడపలో ఆలయ భూముల కౌలు వేలం పాట నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.మోహన్‌రావు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన 133 సర్వే నెంబర్‌లో 8.72 ఎకరాల వ్యవసాయ భూమి 2024 నుంచి 2027 అనగా మూడు సంవత్సరాలు సాగు కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. వేలం నెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో దేవదాయ, ధర్మాదాయ అధికారుల సమక్షంలో జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

# దేవస్థానం భూములకు కౌలు వేలం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన వ్యవసాయ భూములకు దేవదాయశాఖ అధికారులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కౌలువేలం నిర్వహించారు. ఆర్ఎస్ నెంబర్లు 607/2,574/2 లో ఆలయానికి సంబంధించి ఎకరం 30 సెంట్లు వ్యవసాయ భూమికి 2024–27వ సంవత్సరం వరకు అనగా మూడు సంవత్సరాలకు గాను కౌలు వేలం నిర్వహించారు. ఎనిమిది మంది రైతులు కౌలువేలంలో పాల్గొనగా అంగజాల రాంబాబు అనే రైతు సంవత్సరానికి రూ.26 వేలు కౌలు చెల్లించే విధంగా హెచ్చు వేలం పాడగా అధికారులు ఆయనకు కౌలు వేలం ఖాయం చేశారు. అనంతరం కౌలు దారుడు ఒక ఏడాది కౌలు అనగా 26 వేలు చెల్లించాడు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్.అరుణ, పర్యవేక్షణ అధికారి కంచర్ల సురేష్, దేవస్థానం అర్చకులు డాక్టర్ మామిళ్ళపల్లి ఫణికుమార్, గుమస్తా సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.